సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 7-2-2025
సంపుటి: 20 సంచిక: 268
పేజీలు: 8 వెల: రూ.1



## కలెక్టర్‌ను అభినందించిన లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రథసప్తమి పర్వదినాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించిన తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో జరిగిన వేడుకలు అందరి సమష్టి కృషితో విజయవంతమయ్యాయని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్. మెంటార్ నటుకుల మోహన్ కలసి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రశంసా పత్రాన్ని అందించారు. ఆయన సేవలను ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రస్తావించగా లయన్స్ క్లబ్ వెంటనే ప్రశంసాపత్రాన్ని అందించిందని, ఎన్నడూ లేనివిధంగా వివిధ ప్రాంతాల నుంచి 1.20 లక్షల మంది భక్తులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా దర్శించుకోవడం శుభసూచకమన్నారు. ముఖ్యమంత్రి ఈ రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడుల కృషితో సాధ్యమైందని వారు కొనియాడారు.

# ఇచ్చి పుచ్చుకోవడమే సంప్రదాయం

- కమీషన్లు లేని ఆర్థిక కార్యకలాపాలు
- స్పర్థలకు తావులేని మోనోపలి
- నగరంలో బీఎన్ఐ కాంక్లేవ్
- 'సత్యం'తో ఈడీ చంద్రమౌళి, డీసీ షర్మిళ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాపార రిఫెరల్ సంస్థ. అమెరికాలో ప్రారంభించి 40 ఏళ్లు పూర్తయింది. ప్రపంచంలోని 79 దేశాల్లో సుమారు 10,900 చాప్టర్లలో 3 లక్షల మంది కంటే ఎక్కువ సభ్యులు ఉన్నారు. దేశంలో 20 ఏళ్ల క్రితం ప్రారంభమై 132 పట్టణాల్లో ఈ సంస్థ వ్యాపార రిఫెరల్ కార్యకలాపాలు నిర్వహిస్తుంది.. టెక్నాలజీకి సంబంధించిన సేవలు, సాఫ్ట్‌వేర్లు, కంప్యూటర్లు, మానవ వనరుల సేవలు, అకౌంటింగ్ ప్రొఫెషనల్ సేవలు, రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎలివేటర్లు, ఫర్నిచర్, ఇన్సూరెన్స్, ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ మేనేజ్మెంట్, డెంటల్, న్యాయవాదులు, పార్టీ ప్లానర్లు, క్యాటరర్లు, ప్లంబింగ్, ట్రావెల్స్, ప్రింటింగ్, ఫోటోగ్రాఫర్ తదితర మానవ సంబంధాలు కలిగిన వ్యక్తిగా, వ్యాపార, వాణిజ్యం చేస్తున్నవారు సభ్యులుగా బీఎన్ఐలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలు వెలకట్టలేనివి. బీఎన్ఐలో ప్రతి సభ్యుడు ఒకరికొకరు రిఫెరల్ ఇచ్చుకోవడం, ఇతర సభ్యులందరికీ మద్దతుగా నిలవాలనే లక్ష్యంతో పని చేస్తుండడం వల్ల వివిధ రకాల వ్యాపార భాగస్వామ్యులందరికీ ఆర్థిక ప్రయోజనం సమకూరడం, వ్యాపారం వృద్ధిచెందడంతో పాటు కార్యకలాపాలు విస్తారమవుతాయి. సంస్థ కార్యకలాపాలను మరింత ముందుకు తీసుకువెళ్లి వ్యాపార, వాణిజ్యవేత్తలను భాగస్వామ్యం చేయడానికి నగరానికి చెందిన వీఎస్ఆర్ గ్రూప్ సమర్పణలో బీఎన్ఐ శ్రీకాకుళం, విజయనగరం రీజియన్ ఆధ్వర్యంలో బిజినెస్ నెట్‌వర్క్ కాన్‌క్లేవ్‌ను నిర్వహిస్తున్నట్టు బీఎన్ఐ ఈడీ ఎం.చంద్రమౌళి, డీసీ ఉణ్ణ షర్మిళ తెలిపారు. ఈ సందర్భంగా 'సత్యం'తో వారిద్దరూ ముచ్చటించారు.**




**ప్రశ్న: బీఎన్ఐ కార్యకాలాపాలు ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు?**

**జవాబు:** బీఎన్ఐ అంటే బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్. ఇది వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి, విస్తరించడానికి, ప్రమోట్ చేసుకోవడానికి, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడానికి చక్కటి వేదిక. వ్యాపారాభివృద్ధికి చుక్కాని లాంటిది. దీన్ని వివిధ రకాల వ్యక్తిగత వ్యాపారాల సమూహం అనొచ్చు. జిల్లాలో మూడున్నరేళ్ల క్రితం ప్రారంభించాం. శ్రీకాకుళం ప్రధాన కేంద్రంగా దీన్ని ముందుకు నడుపుతున్నాం. ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలో రెండు చాప్టర్లు (గ్రూప్స్)లో 30 మంది చొప్పున 60 మంది ఉన్నారు.

**ప్రశ్న: బీఎన్ఐ వల్ల ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చు?**

**జవాబు:** బీఎన్ఐలో సభ్యుడిగా చేరివారెవరూ ఎవరికీ కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. అస్సలు కమీషన్ అన్న మాటకు తావే లేదు. గివ్స్ గెయిన్ ఫార్ములాను అనుసరించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున వ్యాపారం విస్తరించడానికి, వృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇందులో సభ్యులుగా పోటీ వ్యాపారాలను అనుమతించం. మీరు ప్రింట్ ఏజెన్సీ అయితే, మీరు బీఎన్ఐలో ప్రింట్ సర్వీస్ ప్రొవైడర్ మాత్రమే అవుతారు. మీరు ఇన్సూరెన్స్ ఏజెంట్ అయినా, మార్కెటింగ్ ఏజెన్సీ అయినా ఒక చాప్టర్‌లో ఒక్కరు మాత్రమే ఉంటారు. దీనివల్ల పోటీ వ్యాపారం జరగడానికి వీలుండదు. దీనివల్ల బీఎన్ఐలో ఉన్న వ్యాపార భాగస్వామ్యుల మధ్య సహృద్భావ వాతావరణం కలిగి ఉంటుంది.

**ప్రశ్న: బీఎన్ఐ మోడల్ ఇక్కడ సూట్ అవుతుందా?**

**జవాబు:** వినియోగదారులకు వివిధ రకాలైన సేవలను,

- మిగతా చివరి పేజీలో

## ఆశ్రమాల్లో శ్రీ విగ్రహ ప్రతిష్ఠ



(సత్యంన్యూస్, రణస్థలం)

కోష్ట నేషనల్ హైవే పక్కన గల శ్రీకృష్ణచైతన్య మఠంవారి గోశాల, శ్రీ రాధాగోవింద గోకులానంద ఆశ్రమంలో శ్రీ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తూ శ్రీ విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు, ఐటీ/ కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆస్థాన కేశవ మహారాజు, కూటమి ముఖ్య నాయకులు, సాధువులు, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## స్టెమి.. గుండెపోటుకు భరోసా!

- ఇప్పుడు పాలకొండ ఏరియా ఆసుపత్రిలో లభ్యం
- ఫ్రీగా రూ.45వేలు విలువ గల ఇంజక్షన్
- దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం
- గుండెపోటు లక్షణాలుంటే తక్షణం సంప్రదించండి
- ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కాపాడాం
- సూపరింటెండెంట్ డాక్టర్ జి.నాగభూషణ్

(సత్యంన్యూస్, పాలకొండ)

గుండెపోటుకు ఎమర్జెన్సీగా ఇచ్చే టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్ పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ఉచితంగా వేస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నాగభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు గుండెపోటు వ్యాధిగ్రస్తులు హుటాహుటిన వైజాగ్ లేదా శ్రీకాకుళం వెళ్లవలసి వచ్చేదని, వెళ్లేలోపు కొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు వుండవచ్చన్నారు. గుండెపోటు వచ్చిన వారికి ఎంత త్వరగా ఈ ఇంజక్షన్ ఇస్తే అంత మంచిదని తెలిపారు.

**స్టెమి ప్రోగ్రామ్:** గుండెపోటుకి ఇచ్చే టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్ సుమారు రూ.45వేలు విలువ ఉంటుంది. ఇది పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ఉచితంగా లభిస్తుందని సూపరింటెండెంట్ నాగభూషణ్ తెలిపారు. ఈ ఇంజక్షన్ ఇచ్చి ఇంతవరకు మనం 12 మంది గుండెపోటు రోగుల ప్రాణాలను కాపాడగలిగామని ఆ ప్రకటనలో చెప్పారు. చాతి నొప్పి, ఆయాసం తదితర గుండెపోటు లక్షణాలు గల రోగులు నేరుగా గాని, 108లో గాని త్వరగా పాలకొండ ఏరియా ఆసుపత్రి పాలకొండకి వచ్చి ఈసీజీ తీసి ఆన్‌లైన్‌లో కార్డియాలజిస్ట్‌ను సంప్రదిస్తే గుండెపోటును నిర్ధారించి వెంటనే టేనెక్టివ్ ప్లేస్ ఇంజక్షన్‌ను ఇచ్చి ప్రాణాలు కాపాడే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ స్టెమి కార్యక్రమం పల్లె ప్రజలకు కూడా అందుబాటులోకి ప్రభుత్వం తీసుకురావడం అదృష్టమని, దీనిపై కరపత్రాలు, ఫ్లెక్సీలతో ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాని సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో తెలిపారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# బతకడం కోసం.. చచ్చిపోతున్నారు!

అమెరికాలో అక్రమంగా ప్రవేశించేవారిలో ఎక్కువ మంది వెళ్లేది 'గాడిద మార్గం'. ఎల్ బుర్రో అనే స్పానిష్ మాటకు అర్థం గాడిద. గాడిదలా బరువులు మోసుకొంటూ అడ్డదిడ్డంగా వెళ్లడం అనే భావాన్నుంచి ఇది పుట్టింది. గాడిద మార్గం రహదారి కాదు. ఎన్నెన్నో దొంగ మార్గాలు. ఇందులో ఒకటి దరియెన్ ఖాళీ స్థలం. అతి భయంకరమైన కీకారణ్యం, చిత్తడి నేల. పొడవు 97 కిలోమీటర్లు. పనామా.. కొలంబియా మధ్య వుంది. విషపాములు, చిరుతలు, విష కీటకాలు ఇక్కడ లెక్కకు మించి ఉంటాయి. ఎప్పుడూ వర్షం. దానితో పాటే ఎండ, వేడి.. చెమటలు కారిపోతాయి.

### డ్రగ్ మాఫియాలతో అసలు సమస్య

అసలు సమస్య ఇక్కడ ఉన్న డ్రగ్ మాఫియాలు. ఆడవాసన కనబడితే వదిలిపెట్టరు. ఈ మార్గంలో వెళ్లేవారికి ఏజెంట్స్ ముందుగానే కండోమ్‌లు ఇస్తారు. డ్రగ్ కేటుగాళ్లతో సంభోగానికి ఒప్పుకోవాలి. లేకపోతె చిత్రహింసలు పెట్టి రేప్ చేసి చంపేస్తారు. ఇవన్నీ లేకుండా ముందుగానే ఒప్పుకొంటే ప్రాణం దక్కుతుంది. ఎయిడ్స్ సోకకుండా రబ్బరు తొడుగు. వారు అడిగితే చేతిలో ఉన్న డబ్బు మొత్తం ఇచ్చేయాలి. రోజుకు ఒక చిన్న బ్రెడ్ ముక్క, రెండు బిస్కెట్లు. తాగునీరు పెద్దగా అందుబాటులో ఉండదు. **దరియెన్ గాప్ ప్రయాణం వారం నుంచి 15 రోజులు పడుతుంది. అదేంటి కేవలం 97 కిలోమీటర్స్ కదా.. అనుకొంటున్నారా? కొండలు, గుట్టలు, బురద, చెట్లు చేమలు, పాములు, దోమలు. అడుగు తీసి అడుగు వెయ్యాలనుంటే నరకం. అక్కడ ఖాయిలా పడితే అంతే సంగతి. ఖాయిలా మనిషిని అక్కడే వదిలేసి బృందం ముందుకు వెళ్లిపోతుంది. అంటే అక్కడే తిండి లేకుండా చచ్చిపోతారు. జనాలు వెళుతుంటే దారిలో శవాలు, ఆస్తిపంజరాలు కనిపిస్తాయి.** ఇంతటి దారుణమైన మార్గంలో ఎవరు వెళుతారు అనుకొంటున్నారా? 2023లో మొత్తం అయిదు లక్షల మంది వెళ్లారు. అంతకు ముందు సంవత్సరం కంటే ఇది డబుల్.

### పట్టుబడితే రెండేళ్లు జైలు.. 2.50 లక్షల డాలర్లు అపరాధం

విమానంలో ఎక్కించినా బేడీలు ఎందుకు? భయం.. భయపెట్టడం. **'మా దేశానికి అక్రమమార్గంలో వస్తే పర్యవసానాలు ఇలా ఉంటాయి!' అని అందరికీ హెచ్చరిక. సైకలాజికల్ వార్నింగ్. అందుకే అమృత్‌సర్ ప్రయాణీకుల సంకెళ్ల వీడియోను వారి ప్రభుత్వం అధికారికంగా పెట్టింది. 'దరియెన్ గ్యాప్‌లో ఎన్నో కష్టాలు పడి మా దేశంలో దూరినా పట్టుకొంటాము. చీకటి గదుల్లో బంధిస్తాము. అవమానకర రీతిలో చేతులకు, కాళ్లకు బేడీలు వేసి గెంటేస్తాము'** అని వారు అధికారికంగా చెబుతున్నారు. (గెంటేస్తాము అనే మాట వారు వాడింది) శిక్షించవచ్చు కదా? **టైటిల్ 8 సెక్షన్ 1325.. యూఎస్ కోడ్ ప్రకారం ఆ దేశంలో అక్రమంగా చొరబడితే రెండేళ్లు జైలు, 2.50 లక్షల డాలర్స్ అపరాధం.** ఇప్పుడు గెంటివేయబడ్డవారు ఇటీవలే వెళ్లినవారు. వీరిలో చాలామంది బోర్డర్‌లోనే పట్టుబడి ఇన్నాళ్లు జైళ్లలో ఉన్నవాళ్లే. ఆస్తి మొత్తం అమ్మి ఏజెంట్స్‌కు అప్పచెప్పి అమెరికాలో చొరబడి, అప్పుడే పట్టుబడితే వారి దగ్గర ఏమి ఉంటుంది? ఇరవై లక్షలు కట్టగలరా? అందుకే పంపేస్తున్నారు. ఇది వరకే అక్కడ చొరబడి కాస్తో కూస్తో డబ్బు సంపాదించిన వారితో ఎలా వ్యవహరిస్తారో చూడాలి.

### విద్యార్థుల సంగతి ఏంటి?

స్టడీ వీసాపై వెళ్లినవారు క్యాంపస్ బయట ఉద్యోగాలు చేయకూడదు. ఇన్నాళ్లు సాగింది.. ఇప్పుడు.. పట్టుబడిపోతాము అని భయంతో టెక్సాస్ లాంటి చోట్ల ఎవరూ బయట ఉద్యోగాలకు వెళ్లడం లేదు. వీరు వెళ్లినా పార్ట్ టైం ఉద్యోగాలు ఇవ్వడానికి వారు రెడీగా లేరు. పరిస్థితి దారుణంగా వుంది. ఆయనకో షాప్ వుంది. వ్యాపారం వారి కులవృత్తి. కొడుకును అరవై లక్షల అప్పు చేసి అమెరికా పంపించాడు. అటుపై మరో ఇరవై లక్షల అప్పు. వడ్డీ కట్టలేక మొన్న ఆత్మహత్య చేసుకొన్నాడు. కొడుకు బంగారు భవిత కోసం ప్రాణం విడిచిన తండ్రి.




ఎవరిదీ పాపం? ఇంత జరిగినా జనాలకు ఇప్పటికీ సరైన సమాచారం ఇచ్చేవారు లేరు. 'పక్కవాళ్లు వెళ్లారు.. మనం కూడా వెళ్లాలి' అనే తపనే. గాడిద మార్గంలో ప్రాక్సీ మార్గంలో అమెరికాకు పంపే ఏజెంట్స్ కోటీశ్వరులు అయిపోయారు. అమెరికాలో కేసినోలలో ఒక రాత్రిపూట వారు పందెం కాచే డబ్బు చూసి అమెరికా సంపన్నులే కళ్లు తేలేస్తున్నారు. నాశనం అయిపోతోంది మనోళ్లే, దోచుకొంటోంది మనోళ్లే, మొసలి కన్నీరు కురుస్తోంది మనోళ్లే. డాలర్ డ్రమ్స్ కాస్తా.. డాలర్ నైట్ మెర్ అయ్యింది. బహుశా మరో రెండేళ్లకు ప్రతిభ ఉన్నవారికి ఇండియాలో ఫ్లైట్ ఎక్కేముందే గ్రీన్‌కార్డు చేతిలో పెట్టి మేళతాళాలతో అమెరికా ఆహ్వానించవచ్చు. రహదారికి, అడ్డదారికి తేడా ఇప్పటికైనా తెలుసుకొంటే అందరూ బాగుపడతారు.

- వాసిరెడ్డి అమర్నాథ్



• ఎడిటోరియల్

# నారాయణ మంత్రం

కొన్ని దశాబ్దాల నుంచి, మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంటికీ, ఆఫీసుకీ మధ్య సరిహద్దులు చెరిగిపోయిన పరిస్థితుల నుంచీ.. వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. పనిగంటల ప్రస్తావనా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. కానీ, గత ఏడాది ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఈ పనిగంటల గురించి కొన్ని కఠినమైన అభిప్రాయాలు చెప్పినప్పటి నుంచి వేడి రాజుకుంది. ఓ పాడ్‌కాస్టులో మాట్లాడుతూ మూర్తి 'పేదరికాన్ని తప్పించుకోవాలి అంటే కష్టపడి పనిచేయాల్సిందే అని మా తల్లిదండ్రులు నేర్పారు. ఆ మాటను అనుసరిస్తూ నేను 70 గంటల పని వారాన్ని సూచిస్తాను. ఎన్నో ఏళ్లుగా నేను వారానికి 85–90 గంటలు పని చేస్తూనే వచ్చాను. పొద్దున 6.20 కల్లా ఆఫీసుకు వెళ్లి, రాత్రి 8:30 తర్వాతే బయటికి వచ్చేవాడిని' అన్నారు. ఈ మాటలు తీవ్రమైన చర్చకు, ట్రోలింగ్‌కి దారితీశాయి. తన కెరీర్‌ను నిర్మించుకునే వ్యక్తికీ, ఇతరుల కోసం చాకిరీ చేసే వ్యక్తికీ మధ్య పనిలో ఉండే ఉత్సాహాన్ని, ఆ పని అందించే ఫలితాలను ఈ సూచన పట్టించుకోలేదన్నది అన్నిటికంటే ముఖ్యమైన విమర్శ. సంస్థల్లో తెలియకుండా పెరుగుతున్న పని ఒత్తిడికీ, యాజమాన్యాల అత్యాశకీ, కరిగిపోతున్న కుటుంబ సమయానికీ ఈ మాటలు ప్రతీక అని చాలామంది భావించారు. కానీ నారాయణమూర్తి మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తన మాటలకు ఎంతోమంది నుంచి అభినందనలు వెల్లువెత్తాయని మురిసిపోయారు. భర్తకు అండగా నిలిచే సుధామూర్తి ఈ వ్యాఖ్యల విషయంలోనూ భర్తను బలపరిచారు. వారానికి 70 గంటలు పనిచేసే అలవాటు తమ కుటుంబం అంతా ఉందని చెప్పారు. కానీ తమ వ్యాఖ్యల పట్ల మధ్యతరగతి కుటుంబాల్లో, సాధారణ ఉద్యోగులలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని గ్రహించారో అప్పుడు మూర్తి స్వరం మారింది. అది తన వ్యక్తిగత అభిప్రాయం అనీ, ఎన్ని గంటలు పనిచేయాలీ అన్నది ఒకరి పరిస్థితులు, ఇష్టాయిష్టాలను బట్టి ఉంటాయని, వాటిని బలవంతంగా ఆపాదించలేమని చెప్పుకొచ్చారు. ఇది ఇలా ఉండగా 'మీతో ఆదివారాలు కూడా పని చేయించుకునే అవకాశం లేకపోవడం దురదృష్టం. అయినా ఇంటికి వెళ్లి ఏం చేస్తారు? ఎంతసేపని పెళ్లాం మొహం చూస్తూ కూర్చుంటారు? నేనైతే వారానికి 90 గంటలు పనిచేస్తాను' దేశంలోనే అతిపెద్ద నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ చైర్మన్ అన్నమాటలివి. 'మన సంస్థను తప్ప నా కుటుంబాన్ని పట్టించుకోను. మీరు కూడా పట్టించుకోవడానికి వీల్లేదు. మీ కుటుంబం ఏమైపోయినా నాకు అనవసరం!' ఓ జూమ్ మీటింగ్‌లో ఉన్నతాధికారి ఇచ్చిన తాఖీదు ఇది. పైకి చెప్పకపోవచ్చు, చెప్పినా అవి బయటికి రాకపోవచ్చు. కానీ, చాలా సందర్భాల్లో ఇలాంటి అభిప్రాయాలే యువతరంతో పని చేయిస్తున్నాయి. 'యువర్ దోస్త్' అనే సంస్థ 21–30 ఏళ్ల వయస్కుల్లో ఒత్తిడిని నమోదు చేసే ప్రయత్నం చేసింది. ఇందుకోసం 5వేల మందిని ప్రశ్నించగా వారిలో 64 శాతం మంది ఉద్యోగంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని చెప్పుకొన్నారు. విచారించదగ్గ విషయం ఏమిటంటే మగవారితో పోలిస్తే, మహిళలు పని వాతావరణంలో మరింత ఒత్తిడికి లోనుకావడం. ఆఫీసుకు వెళ్లినా కూడా ఇల్లు, పిల్లల బాధ్యత కూడా తనదే అనే తీరు ఇందుకు కారణం కావచ్చు. ఉద్యోగపు ఒత్తిడితో ముందు పాడయ్యేది ఆరోగ్యం. రక్తపోటు పెరగడం, కుంగుబాటు, సంతానలేమి, కూర్చుని కూర్చుని మధుమేహం లాంటి సమస్యలు రావడంతో పాటు.. చిన్నపాటి వైరస్‌ను ఎదుర్కోలేనంతగా రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని తేలింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ పరిశోధనలో వారానికి 55 గంటలకు మించి పని చేసేవారిలో గుండెపోటు వచ్చే అవకాశం 13 శాతం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఒకప్పుడు దశాబ్దాల తరబడి ఒకే సంస్థలో ఉద్యోగాలు చేసేవారు. కానీ, ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ముఖ్య కారణం ఒత్తిడి అని పేర్కొంటున్నారు. ఈ విషయమై 'క్రోనోస్' అనే సంస్థ తలపెట్టిన అభిప్రాయ సేకరణలో 46 శాతం మంది మానవవనరుల అధికారులు.. ఉద్యోగులు మానేయడానికి ఒత్తిడే ముఖ్య కారణంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితి దీర్ఘకాలికంగా అటు యాజమాన్యానికీ, ఇటు ఉద్యోగులకు కూడా నష్టమే కలిగిస్తుంది. ఎంతసేపు పని చేశాం అన్నది కాదు.. ఎంత నాణ్యంగా పని చేశామన్నదే ముఖ్యం. అయినా ఇంట్లో గడపకుండా, స్నేహితులతో మాట్లాడకుండా, పుస్తకాలు చదవకుండా, ఆలోచించడానికే సమయం ఇవ్వకుండా.. ఎవరైనా సరైన నిర్ణయాలను ఎలా తీసుకోగలరు?



# క్షమా సావంత్ వీసా.. ఎందుకు రిజెక్టవుతోంది!

క్షమాసావంత్.. ఇప్పుడు ఈమో హాట్ టాపిక్. భారతీయ మూలాలున్న అమెరికావాసి క్షమాసావంత్ కు వరుసగా భారత్ వీసా రిజెక్ట్ చేయడంతో ఇప్పుడీమె మళ్లీ వార్తల్లో ప్రధాన వ్యక్తైంది.

### అసలు క్షమాసావంత్ ఎవరు..?

అమెరికాలోని సియాటిల్ కౌన్సిల్ ఎక్స్ మెంబర్‌గా, హక్కుల కార్యకర్తగా క్షమాసావంత్ సుపరిచితురాలు. అంతకుమించి భారత ప్రభుత్వంపై, ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పరిపాలనపై సావంత్ చేసిన బహిరంగ విమర్శలు ఆమెను వివాదాస్పద వ్యక్తిగా మార్చాయి. పౌరసత్వ సవరణ చట్టం సీఏఏ, అలాగే.. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ ఎన్ఆర్సీ వంటివాటిని క్షమాసావంత్ తీవ్రంగా వ్యతిరేకించింది. 2020లో ఏకంగా సియాటిల్ కౌన్సిల్ లో తాను మెంబర్‌గా ఉన్నప్పుడు.. సీఏఏను ఖండిస్తూ ఓ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టింది. పైగా దానికి అక్కడి కార్మిక, విభిన్నమతాలకు సంబంధించిన సంఘాల మద్దతును కూడగట్టింది. కులవివక్షపై పోరాడే మొట్టమొదటి నగరంగా అమెరికాలో సియాటిల్ ను నిలపడంలో సావంత్ కీలక పాత్రధారి.

అయితే, ఆమె భారత్ లోని మోడీ ప్రభుత్వ విధానాలపైన మాత్రమే కాదు.. సియాటిల్ నగర కౌన్సిల్‌లో మెంబర్ గా ఉన్నప్పుడు కార్మికులకు గంటకు 7.25 డాలర్స్‌గా ఉన్న వేతనాన్ని 20.76 డాలర్స్‌గా పెంచాలంటూ ఫైట్ చేసింది. కరోనా కోరలు చాచిన కాలంలో బిలియన్ డాలర్స్ కంపెనీలైన అమెజాన్ వంటివాటికి పన్నులు పెంచి.. ట్యాక్సుల రూపంలో వచ్చిన డబ్బును కోవిడ్–19 రిలీఫ్ ఫండ్ గా ఉపశమన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. అలాగే, భారత ప్రభుత్వం తీసుకురావాలనుకున్న వ్యవసాయ చట్టాలనూ ఖండిస్తూ తీర్మానాలను కౌన్సిల్ లో ప్రవేశపెట్టింది. వాటిపైన విస్తృతస్థాయిలో నిరసనలు చేపట్టి వార్తల్లో నిల్చింది.

### వరుసగా వీసా నిరాకరణతో మళ్లీ వార్తల్లోకి క్షమాసావంత్!

భారతదేశంలో ఉన్న తన తల్లి ఆరోగ్యపరిస్థితి బాగా లేకపోవడంతో క్షమాసావంత్ తల్లిని చూడ్డానికి ఇండియాకు రావాలనుకుంది. అందుకోసం ఆమె అత్యవసర పరిస్థితి కింద తనకు వీసా మంజూరు చేయాలని కోరినా ఆమెకు వీసా రిజెక్ట్ కావడంతో ఇప్పుడు భారత ప్రభుత్వ తీరుపై ఆమె మండిపడుతోంది. అప్పటికే ఆమెకు రెండుసార్లు భారత వీసా కోసం అప్లై చేసినా తిరస్కరించడంతో.. తన తల్లి ఆరోగ్యం కోసం మెడికల్ ఎమర్జెన్సీ కింద డాక్టర్ సర్టిఫికెట్స్ వంటివీ అటాచ్ చేసి పంపినా వీసా రిజెక్టైనట్టు రావడం.. ఎందుకు తిరస్కరించారో కారణాలు పేర్కొనకపోవడంతో సావంత్ ఇండియన్ గవర్నమెంట్ తీరుపై ఫైర్ అవుతోంది. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలోనూ పోస్ట్ చేసింది.

### అత్యవసర పరిస్థితిని వివరించినా రాజకీయాలా అని ప్రశ్నిస్తున్న సావంత్!

సావంత్ వీసా కోసం మొదట 2025 మేలో దరఖాస్తు చేసుకుంది. అప్పుడూ ఆమె వీసా తిరస్కరణకు గురైంది. ఆ తర్వాత 2024 జూన్ లోనూ మళ్లీ అప్లై చేసినా అదే పరిస్థితెదురైంది. ఇక మెడికల్ ఎమర్జెన్సీ పేరిట తన 82 ఏళ్ల తల్లికి ఎదురైన వ్యాధుల తీవ్రతను వివరిస్తూ తాను తప్పక వెళ్లాల్సిన అత్యవసర పరిస్థితిని పేర్కొన్నా వీసా రిజెక్ట్ కావడం, కారణాలేంటో వెలిబుచ్చకపోవడంతో పాటు ఆమె భర్త కాల్విన్ ప్రీస్ట్ కు మాత్రం వీసా మంజూరు కావడంపై ఆమె ఆశ్చర్యం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కచ్చితంగా తనపైన రాజకీయ కక్షసాధింపు చర్యేనన్నది క్షమాసావంత్ చెబుతున్న మాట.

పదేళ్లు తాను సియాటిల్ నగర కౌన్సిల్ మెంబర్‌గా ఉన్న సమయంలో తనపై ప్రతీకారం తీర్చుకుంటే వ్యతిరేకత వస్తుందేమోననుకున్నవారు.. ఇప్పుడు తను అధికారంలో లేని సమయంలో ఇలా వీసా రిజెక్షన్‌తో కక్ష సాధింపుకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు చేస్తోంది సావంత్.

అయితే సావంత్ కేసు ఒక్కటే ఇప్పుడు ప్రత్యేకమైనదేం కాదు. సావంత్ తరహాలో భారత ప్రభుత్వ విధాన పరమైన ఆసక్తికర అంశాలపై ఎవరు విమర్శలు గుప్పించినా ఇలాంటి సవాళ్లనెదుర్కోవాల్సి వస్తోందన్నదే ఇప్పుడు ప్రధాన చర్చ. అలాంటివారిలో స్వీడన్‌లో నివసించే అశోక్ స్వైన్ భారత్ లోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం, తన ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా కార్డ్‌ను రద్దు చేయడంపై ఆయన పెద్ద పోరాటమే చేస్తున్నారు. సేమ్ సావంత్ లాగే స్వైన్‌కు కూడా ఓ వృద్ధ తల్లి భారత్ లో ఉండటం.. ఆయన రావాలనుకున్న సమయంలో వీసా రిజెక్ట్ కావడంతో ఇలాంటి కేసులన్నీ ఇప్పుడు మరింత చర్చకు వస్తున్నాయి. భారత ప్రభుత్వంపై అసమ్మతివాదులను నిశ్శబ్దపర్చేందుకు రాజకీయ ప్రేరేపిత కక్షసాధింపు చర్యలుగా అభివర్ణించబడుతున్నాయి.

**- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...**

**తమిళ టాప్ స్టార్లలో ఒకడైన అజిత్ హీరోగా తెరకెక్కిన కొత్త చిత్రం.. విడాముయర్చి. దీని తెలుగు వెర్షన్.. పట్టుదల. త్రిష కథానాయికగా నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.**



**కథ:** అర్జున్ (అజిత్) అజర్బైజాన్లోని బాకులో ఒక యుఎస్ కంపెనీలో ఉద్యోగి. అతడి భార్య కయల్ (త్రిష). ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట కొన్నేళ్ల వరకు సంతోషంగా గడుపుతుంది. కానీ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు మొదలవుతాయి. పెళ్లయిన పన్నెండేళ్లకు ఇద్దరు విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకుంటారు. ఈ నిర్ణయం తర్వాత కయల్ ను తన పుట్టింట్లో దించడానికి కారులో బయల్దేరతాడు అర్జున్. కానీ దారి మధ్యలో వీరి కారు బ్రేక్ డౌన్ అవుతంది. ఈ క్రమంలోనే కయల్ కిడ్నాప్ అవుతుంది. ఆమె కోసం వెతికే క్రమంలో అర్జున్ కు ఊహించని పరిస్థితులు ఎదురవుతాయి. అవేంటి.. ఇంతకీ కయల్ ఏమైంది? ఆమెను అర్జున్ కనిపెట్టాడా లేదా అన్నది మిగతా కథ.

### నటీనటులు:

అజిత్ తన ఇమేజ్ ఛత్రం నుంచి బయటికి వచ్చి కమర్షియల్ హంగులు లేని.. కథను అనుసరించి సాగే థ్రిల్లర్ మూవీలో నటించడం అభినందనీయమే. ఆయన ఫిల్మోగ్రఫీలో ఇదొక డిఫరెంట్ ఫిల్మే కానీ.. స్పెషల్ మాత్రం కాదు. అజిత్ వల్ల ఈ సినిమాకు చేకూరిన ప్రత్యేకత ఏమీ లేదు. పాత్ర.. పెర్ఫామెన్స్ పరంగా అజిత్ ముద్ర చూపించడానికి ఇందులో పెద్దగా అవకాశం లేకపోయింది. దీని కంటే అజిత్ ఎప్పుడూ చేసే రొటీన్ మాస్ మసాలా సినిమాలే మేలు అనిపిస్తుంది. త్రిష తన పాత్రను హుందాగా పోషించింది. తన లుక్.. నటన బాగున్నాయి. కానీ తనకు కూడా ఇందులో స్కోప్ తక్కువే. విలన్లుగా అర్జున్-రెజీనా బాగానే చేశారు కానీ.. వాళ్ల పాత్రల్లో కూడా బలం లేదు. బిగ్ బాస్ ఫేమ్ ఆర్ణవ్ నెగెటివ్ రోల్ లో ఆకట్టుకున్నాడు. మిగతావారు మామూలే.

### సాంకేతిక వర్గం:

తాను చేసిన పెద్ద సినిమాల గురించి రిలీజ్ ముంగిట ఒక రేంజిలో ఎలివేషన్లు ఇస్తుంటాడు అనిరుధ్. కానీ ఈ చిత్రానికి మాత్రం మౌనం వహించాడు. అప్పుడే ఈ సినిమా విషయంలో అతడి అయిష్టత అర్థమైపోయింది. అది సంగీతం విషయంలో కూడా ప్రతిబింబించింది. ఉన్న రెండు పాటలు ఏమాత్రం ఆకట్టుకోవు. నేపథ్య సంగీతం కూడా ఏదో మొక్కుబడిగా సాగుతున్నట్లు అనిపిస్తుంది. ఓం ప్రకాష్ ఛాయాగ్రహణం బాగుంది. విజువల్స్ ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. 'బ్రేక్ డౌన్' నుంచి తీసుకున్న స్టోరీ లైన్ బాగున్నప్పటికీ.. దానికి మగిల్ ట్రెండీగా అనిపించే స్క్రీన్ ప్లేను జోడించలేకపోయాడు మగిల్ తిరుమణి. ఎంత షాకింగ్ ట్విస్టునైనా ముందే గెస్ చేసేసే స్థాయిలో థ్రిల్లర్ సినిమాలకు ప్రేక్షకులకు అలవాటు పడిపోయిన ఈ రోజుల్లో ఇలాంటి డల్ స్క్రీన్ ప్లేతో.. పేలని ట్విస్టులతో సినిమాను నడిపించి మెప్పించడం చాలా చాలా కష్టం.

# పట్టుదల.. పట్టు లేని థ్రిల్లర్!

### కథనం-విశ్లేషణ:

'పట్టుదల' సంక్రాంతికే విడు దల కావాల్సిన సినిమా. కానీ ఆ సినిమా మీద కాపీరైట్ కేసు పడ డంతో నెల ఆలస్యంగా ఈ రోజు విడుదలైంది. హాలీవుడ్ మూవీ 'బ్రేక్ డౌన్'ను కాపీ కొట్టి ఈ సినిమా తీసిన విషయం తెలిసి నిర్మాణ సంస్థ కేసు వేస్తే.. ఏదో సెటిల్మెంట్ చేసుకుని ఈ రోజు సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చారు. ఐతే 'బ్రేక్ డౌన్' ఏమీ ఈ మధ్య వచ్చిన చిత్రం కాదు. ఎప్పుడో 1997లో విడుదలైన సినిమా. వేరే జానర్లంటే ఓకే కానీ.. థ్రిల్లర్ సినిమాలు ఎంతగానో అప్ గ్రేడ్ అయిపోయి ప్రేక్షకుల మైండ్ ను బ్లాంక్ చేస్తున్న ఈ రోజుల్లో.. 28 ఏళ్ల కిందటి సినిమాను ఇప్పుడు ఫ్రీమేక్ చేస్తే ప్రేక్షకులు మెచ్చుతారని చిత్ర బృందం ఎలా అనుకుందో ఏమో? 'పట్టుదల' సినిమాను రూపొందించిన మగిల్ తిరుమణి కొన్నేళ్ల ముందు తీసిన 'తడమ్' సినిమాను ఒకసారి మళ్లీ చూసుకుని ఉంటే.. 'బ్రేక్‌డౌన్' మూవీ దాని ముందు నిలవలేదని అర్థమై ఉంటుంది. ప్రేక్షకులను తీవ్ర ఉత్కంఠకు గురిచేసే.. ఉర్రూతలూగించే అద్భుతమైన థ్రిల్లర్లు ఎన్నో ఓటీటీల్లో అందు బాటులో ఉన్న సమయంలో 'పట్టుదల' కనీస స్థాయిలో కూడా ప్రేక్ష కులను థ్రిల్ చేయదు. ఇందులోని ట్విస్టుల్ని అసలు ట్విస్టులనే పరిగ ణించలేం. ఏ దశలోనూ ప్రేక్షకులను అవి ఆశ్చర్యపరచలేవు. ట్విస్టుల సంగతి పక్కన పెడితే.. థ్రిల్లర్ సినిమాకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణమైన రేసీ స్క్రీన్‌ప్లే కూడా మిస్ కావడంతో 'పట్టుదల' ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది.

ఒక భర్త.. ఒక భార్య.. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట 12 ఏళ్ల కాపురం తర్వాత విడిపోవాలనుకుంటుంది. కానీ భార్యను పుట్టింట్లోకి తీసుకెళ్లే ప్రయాణంలో ఆమె కిడ్నాప్ అవుతుంది. చిన్న క్లూ కూడా దొరకని పరిస్థితుల్లో ఆ భర్త.. తన భార్యను ఎలా వెతికి పట్టుకున్నాడనే నేపథ్యంలో నడుస్తుంది 'పట్టుదల'. అజిత్ లాంటి పెద్ద మాస్ హీరోతో ఇలాంటి చిన్న పరిధి ఉన్న కథను చేయాలనుకోవడం ఆశ్చర్యమే. ఐతే కథ చిన్నదిగా అనిపించినా.. కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి దాని స్పాన్ పెంచే అవకాశం ఉన్నప్పటికీ దర్శకుడు మగిల్ తిరుమణి అలాంటి ప్రయత్నమేమీ చేయకపోవ డం కూడా అభినందనీయమే. అజిత్ కు ఉన్న స్టార్ ఇమేజ్ దృష్ట్యా.. అతను ఏదనుకుంటే అది చేసేసి.. అడ్డొచ్చిన వాళ్లందరినీ చితగ్గొట్టేసి పెద్ద మాఫియా సామ్రాజ్యాన్ని కూల్చేసేలా కథను నడిపిస్తారని అనుకుంటాం కానీ.. అలాంటిదేమీ ఉండదు. ఐతే కథ ఆసక్తికరంగా సాగి.. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే మలుపులు ఉండి.. రేసీ స్క్రీన్‌ప్లే తోడై ఉంటే.. 'పట్టుదల' కచ్చితంగా అజిత్ కెరీర్లో ఒక స్పెషల్ ఫిలిం అయ్యుండేది. కానీ థ్రిల్లర్ సినిమా నుంచి ఆశించే ట్విస్టులు.. థ్రిల్స్ ఏమీ ఇందులో లేకపోవడమే పెద్ద ట్విస్ట్ అని సినిమా పూర్తయ్యాక కానీ అర్థం కాదు.

హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ.. పెళ్లి.. ఎడబాటుకు సంబంధించి చాలా రొటీన్ గా.. బోరింగ్ గా.. డల్లుగా సాగే తొలి అరగంట ఎపిసోడ్ తోనే 'పట్టుదల' ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తుంది. టేకాఫ్ నెమ్మదిగా ఉన్నప్పటికీ.. సినిమా థ్రిల్లర్ రూట్లోకి వెళ్లాక అయినా పరిస్థితి మారుతుందని అనుకుంటాం. కానీ ఏవో సన్నివేశాలు వస్తుంటాయి. పోతుంటాయి. కానీ ఏవీ ఆసక్తి రేకెత్తించవు. ముందుకు సాగే కొద్దీ సినిమా సగటు కిడ్నాప్ డ్రామాలా కనిపిస్తుందే తప్ప.. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే.. అబ్బుర పరిచే అంశాలేమీ కనిపించవు. ఏదైనా బ్యాంగ్ బ్యాంగ్ ఎపిసోడ్ వచ్చి ప్రేక్షకుల్లో ఊపు వస్తుందేమో అని ఆశిస్తాం కానీ.. ఎంతకీ అది జరగదు. హీరో తొలిసారి తిరగబడే యాక్షన్ ఎపిసోడ్ ఒక్కటి పర్వాలేదనిపిస్తుంది. విలన్ల బ్యాక్ స్టోరీ సైతం చాలా సాధారణంగా అనిపిస్తుంది. హీరో తన మిషన్ మొదలుపెట్టి మొత్తం విలన్ రాకెట్ ను దెబ్బ కొట్టే క్రమంలో వచ్చే యాక్షన్ సన్నివేశాలు మాత్రం బాగా తీశారు కానీ.. కథ పరంగా మాత్రం ఎక్కడా కనెక్ట్ అయ్యే పరిస్థితి ఉండదు. సినిమా కోసం ఎంచుకున్న అజర్బైజాన్ నేపథ్యంలో ప్లస్ కాకపోగా.. చాలా చోట్ల చికాకు పెడుతుంది. ఇది మన సినిమా కాదనే ఫీలింగ్ కలిగిస్తుంది. ముగింపు సన్నివేశాల్లోనూ పెద్దగా మెరుపులు లేక 'పట్టుదల' తీవ్ర నిరాశనే మిగులుస్తుంది.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. 10వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభంకానున్నాయని ఆర్ఐవో పి. దుర్గారావు తెలిపారు. ప్రయోగ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఒకేషనల్ కోర్సు పరీక్షలు 5 నుంచి ప్రారంభమవుతాయన్నారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వరకూ జరుగుతాయన్నారు. మొత్తం 40,356 మంది (ఫస్టియర్ 20,389, సెకండియర్ 19,967మంది) విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 37,976మంది సాధారణ, 2380 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. 75 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాలు ఎలాంటి సాంకేతిక లోపం లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర మందులతోపాటు వైద్య సిబ్బంది విధులు నిర్వర్తించాలని, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేయాలని మెడికల్‌కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రయోగ పరీక్షలు చేసే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, ఆయా అంశాలపై ఆయా శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. నిర్దేశించిన సమయానికి విద్యార్థులు కచ్చితంగా పరీక్ష కేంద్రాలకు హాజరు కావాల్సి ఉంటుందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఏవైనా సమస్యలు లోటుపాట్లు ఉంటే పరీక్షలకు ముందే వాటిని గుర్తించి పరిష్కరించుకోవాలని సూచించారు. మునిసిపల్, పంచాయతీ పరిధిలో ఉన్న పరీక్షకేంద్రాల వద్ద ఆయా శాఖల అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో పరీక్షకేంద్రానికి హాజరయ్యే విద్యార్థులు సమయానికి చేరుకునేలా ప్రణాళిక బద్ధంగా ఆయా రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరావు, అదనపు ఎస్పీ డివిఈఓ ఎస్.తవిటినాయుడు, డీఈవో తిరుమల చైతన్య, ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.


పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455


# ఎంపీడీఓగా రమేష్ నాయడు

(సత్యంన్యూస్, మందస)



మందస ఎంపీడీఓగా రమేష్ నాయడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వజ్రపుకొత్తూరు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రమేష్ నాయడుకు పూర్తి అదనపు బాధ్యతలతో మందసకు ఇంచార్జిగా నియమించారు. ఆయనకు మండల పరిషత్ పరిపాలనాధికారి ఋషేశ్వరరావుతోపాటు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శిలు సచివాలయం సిబ్బంది, పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎక్సైజ్ కేసులు ఎక్కువ రాజీ చెయ్యండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవఅధికారి సంస్థ వారు స్థానిక జిల్లా కోర్టు భవనం ఆవరణలో వచ్చేనెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ఉద్దేశించి గత అదాలత్ మాదిరిగా ఈ అదాలత్‌లో కూడా ఎక్కువ ఎక్సైజ్ కేసులు రాజీ చేసి జిల్లాలో గల పెండింగ్ కేసులను తగ్గించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జూనైద్ అహ్మద్ మౌలానా కోరారు. ఈమేరకు గురువారం ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు, ఎల్ అనురాధ దేవి, ఎంవీ గోపాలకృష్ణ, సిఐ, ఎక్సైజ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.




మాత రమాభాయ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో జ్యోతీరావుపూలే పార్కులో తైక్వాండో శ్రీను ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏమీరూల్లా బేగ్, ప్రధాన కార్యదర్శి గద్దిబోయిన కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు కిల్లాన శ్రీనివాస్, గుత్తి చిన్నారావు, రాష్ట్ర కార్యదర్శి కైత వెంకటరమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

# శోభాయాత్రకు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్, కళ్యాణ వెంకటేశ్వరస్వామి, నారాయణ తిరుమల సంయుక్తంగా నిర్వహిస్తున్న శోభాయాత్రకుగానూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరికతోట కనకరాజు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో గల భక్తులు, భజన మండళ్ల ఆధ్వర్యంలో ఈ శోభాయాత్ర జరుగుతుందన్నారు. తప్పిటగుళ్లు, కోలాటాలు, చెక్క భజనలతో యాత్ర కొనసాగుతుందన్నారు. నారాయణ తిరుమల నుంచి ప్రారంభించి ఏడు రోడ్ల కూడలి మీదుగా కలెక్టర్ బంగ్లా దగ్గర గల కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం దగ్గర ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో పాల్గొన్న సుమారు 300మంది భక్తులకు అల్పాహారం, పానీయాల నిమిత్తం రూ.10వేలు అందజేశానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బెహరా నాగేశ్వరరావు, కోశాధికారి దండు రామారావు, అధ్యక్షులు యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఈ.యం.టి.లకు శిక్షణ తరగతులు

(సత్యంన్యూస్, టెక్కలి)



అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించే108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌లకు టెక్కలి జిల్లా హాస్పిటల్ ఆవరణంలో శుక్రవారం ఏ.ఈ.ఎం.యస్ ఓ.ఈ రంగాప్రసాద్ పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై తరగతులు నిర్వహించారు. సి.పి.ఆర్‌పై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్‌ల 108 ఈ.యం.టిలు పాల్గొన్నారు

# శ్రీ ముఖలింగంలో అనధికారిక వసూళ్లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో గత కొన్ని రోజులుగా నిత్య అన్నదానానికి అనధికారిక వసూలు చేస్తున్నారని ఆలయ ప్రధాన అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ విమర్శించారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతానికి ఈ ఆలయంలో ఎటువంటి నిత్యాన్నదానం జరగడం లేదన్నారు. దీనిని గమనించి రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్న భక్తులు ఎవరికీ ఎటువంటి విరాళాలు ఇవ్వవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇచ్చినా అవి స్వామివారికి చెందవన్న విషయం గమనించాలన్నారు. ఎవరైనా అన్నదానం చేయాలనుకుంటే స్వయంగా ఆలయం వద్దకు వచ్చి అన్నదానం నిర్వహించుకోవచ్చన్నారు. లేకుంటే పది మంది అర్చకుల సమక్షంలో దేవాలయంలో అందజేసి రశీదును స్వీకరించాలని కోరారు. దయ చేసి భక్తులు విషయాన్ని గమనించి ఆలయ పవిత్రతను కాపాడాలని సూచించారు.

# కూటమి ప్రభుత్వం ప్రజల పక్షం

- సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గ్రీవెన్స్
- వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గొండు శంకర్
- ప్రజా గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఏర్పడిన ప్రభుత్వం ఇది అని, ఇది ముమ్మాటికి ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గార, శ్రీకాకుళం రూరల్ మండలాలు, అర్బన్ ప్రజల నుంచి గురువారం వినతులు స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ళ కోసం, గ్రామాల్లో రోడ్లు, కాలువలు నిర్మాణానికి అధికంగా అర్జీలు వస్తున్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలన కారణంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్తు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా నోచుకోకపోవడంతో ప్రజలు దుర్భర పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడు తున్నామన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒకే రోజులో వేలాదిగా గ్రామసభలు నిర్వహించి పల్లెల్లోని సమస్యలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఆయా సమస్యల పరిష్కారా నికి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపనలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టి పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొనే దిశగా కొనసాగుతామన్నారు. ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి వేలాదిగా వినతులు వస్తుండడం చూస్తుంటే గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యధోరణికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. గార మండలం సతివాడ గ్రామానికి చెందిన వెలగాడ ఆదినారాయణ తీవ్ర అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమతలేక ఇబ్బందులు పడుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహకారం అందించాలని కోరేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకు ఆటోలో వచ్చిన వారి దగ్గరకు స్వయంగా శాసన సభ్యులు శంకర్ వెళ్లి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని తక్షణం చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి జగన్ రెడ్డి రాష్ట్రాన్ని 30ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని చెప్పారు. గ్రామ స్వరాజ్య పాలన కోసం గాంధీజీ కలలు కన్న ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గార మండల టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221


## జాతీయ స్థాయి కార్యసాలకు బొద్దూరు ఉపాధ్యాయుడు ఎంపిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరిగే కార్యసాలకు బొద్దూరు జెడ్పీ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు సెంట్రల్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రైనింగ్ అనే కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఎంపికయ్యారు. మన రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించిన ఇద్దరు ఉపాధ్యాయుల్లో దామోదరరావు ఒకరు. కార్యాశాలలో విద్యా విధానంలో భారతీయ సంస్కృతి సాంప్రదాయాల భాగస్వామ్యం గురించి కార్యసాలలో చర్చిస్తారు. దామోదరరావు ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వర రావు, మండల విద్యాశాఖ అధికారులు శాంతికుమారి, భాస్కరరావులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, సూర్య కుమారి, పురుషోత్తము, కృష్ణ, శ్రీరాం, రమేషు, భవాని తదితరులు పాల్గొన్నారు

# రిజర్వేషన్లు అమలయ్యేలా చూడండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళింగకోమట్లను బీసీ-డీలో చేర్చినప్పటికీ సంబంధిత రిజర్వేషన్ల ప్రక్రియ మాత్రం సరిగా అమలు కావడం లేదని రాష్ట్ర కళింగకోమటి సంక్షేమ సంఘం అధ్యక్షులు బోయిన గోవిందరాజులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని కోరుతూ బీసీ కమిషన్ చైర్మన్ శంకర నారాయణ, సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి, బీసీ వెల్ఫేర్ గవర్నమెంట్ సెక్రటరీ సత్యనారాయణలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం గోవిందరాజులు మాట్లాడుతూ గత ప్రభుత్వములో కళింగకోమట్లను బీసీ-డీలో చేర్చే విధంగా జీవో నెంబర్ 25ను జారీ చేసిందన్నారు. ఆ జీవో గజిట్ పబ్లికేషన్, ఇంప్లిమెంట్ జరగకపోవడం వలన ఏ ఒక్కరూ కూడా రిజర్వేషన్ ఫలితాలను అందుకోలేకపోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దానిని అమలు చేసే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ ప్రక్రియ వేగవంతంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా తమకు తగిన సహకరించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శిష్టకరణ సాధికార కమిటీ చైర్మన్ అక్కుమహంతి రాజా కూడా పాల్గొన్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# ఇచ్చి పుచ్చుకోవడమే సంప్రదాయం

(మొదటిపేజీ తరువాయి)

అవసరాలను ఒక్కచోట నుంచే పొందే వీలు కలిగించేలా బీఎన్ఐ కార్యకలాపాలు రూపొంది ఉంటాయి. బీఎన్ఐలో సభ్యులుగా చేరిన వ్యాపారులు దేశం, రాష్ట్రం, ప్రాంతంలోని స్థానిక సంప్రదాయ పద్ధతులను అనుసరించి వ్యక్తిగత వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. బీఎన్ఐలో సభ్యులుగా చేరినవారంతా ఒక ప్రాంతానికి చెందినవారై పూర్తిస్థాయి నెట్‌వర్క్ కలిగి ఉంటారు. అలా ఉండం వల్లనే వ్యాపారుల మధ్య రిఫరల్ కార్యకలాపాలు నిత్యం జరుగుతుంటాయి. దీనివల్ల వ్యాపారం పెరిగి విస్తరించడానికి అవకాశం కలుగుతుంది. స్థానిక మార్కెట్‌లో కస్టమర్లకు విస్తృతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుంది.

**ప్రశ్న: బీఎన్ఐలో ఎవరు సభ్యత్వం తీసుకోవాలి?**

**జవాబు:** చాలా తక్కువ మొత్తంతో ఒక వ్యాపార సమూహంలో చేరడానికి అవకాశం కల్పిస్తుంది. సేవా ఆధారిత చిన్న వ్యాపారాలు, సమాజానికి సేవ చేసే పెద్ద వ్యాపారాల కమ్యూనిటీ శాఖలు బీఎన్ఐలో సభ్యులుగా చేరడం వల్ల వారికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. బిజినెస్ నెట్‌వర్క్‌ను అంచనావేసి సభ్యత్వానికి సిఫార్సు చేస్తాము. చేస్తున్న వ్యాపార రకాన్ని బట్టి, కస్టమర్ జీవితకాల సేవా ఆధారిత వ్యాపారాలు బీఎన్ఐలో సభ్యులుగా ఉంటారు. పెట్టుబడిపై రాబడిని పొందడానికి వ్యాపారుల మధ్య ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో రిఫరల్‌ను వాడుకుంటారు. శ్రీకాకుళం నగరం కేంద్రంగా ప్రారంభమై కార్యకలాపాలు నిర్వహిస్తున్న బీఎన్ఐ పనితీరును పరిశీలిస్తే ఇందులో చేరితే ఎలాంటి ప్రయోజనం పొందవచ్చో తెలుస్తోంది.

**ప్రశ్న: బీఎన్ఐలో సభ్యత్వం పొందిన తర్వాత?**

**జవాబు:** వ్యాపారులు మధ్య పరస్పరం పంచుకున్న అంశాలను ఆలోచించి, ప్రయోజనాలను ప్రతివారం సభ్యులంతా సమావేశమై విశ్లేషణ చేస్తుంటాము. తమను తాము మార్కెట్ చేసుకోవడం, వారి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడంలో సహాయపడటంపై దృష్టి సారించడానికి బీఎన్ఐ ఒక వేదికగా పని చేస్తుంది. బీఎన్ఐ సభ్యుడిగా కొనసాగే సమయం పెట్టుబడికి విలువైనదిగా నమ్ముతాం. ప్రతి సభ్యుడు బీఎన్ఐ కోసం కొంత సమయం కేటాయించాల్సి ఉంటుంది. వారానికి కనీసం 90 నిమిషాల సమావేశం ఉంటుంది. ఈ సమావేశాల్లో కొత్త వ్యాపారాన్ని ప్రారంభించడం, నూతన సభ్యుడిని చేర్చుకోవడం, ఆసక్తికరమైన వ్యక్తులు వచ్చి వారి వ్యాపార అనుభవాలను, రిఫరల్, ప్రమోషన్ వల్ల కలిగిన ప్రయోజనాలు చర్చించుకొనే అవకాశం ఉంటుంది. కొత్త విషయాలను తెలుసుకోవడానికి, పంచుకోవడానికి ప్రతి సభ్యుడు ప్రతివారం నిర్వహించే బిజినెస్ ఆర్గనైజేషన్‌కు కచ్చితంగా హాజరవుతారు.

**ప్రశ్న: బిజినెస్ నెట్‌వర్కింగ్ కాన్‌క్లేవ్ ఎలా నిర్వహిస్తున్నారు?**

**జవాబు:** బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎస్ఐ) ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం రీజియన్ పరిధిలో బిజినెస్ నెట్‌వర్కింగ్ కాన్‌క్లేవ్‌ను ఈ నెల 9న స్థానిక 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావనం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచే నిర్వహిస్తున్నాము. దీన్ని నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలో ఎంతో అనుభవం ఉన్న ఊణ్ణ సర్వేశ్వరరావు (వీఎస్ఆర్) గ్రూప్ స్పాన్సర్ చేస్తుంది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం నుంచి 300 మంది హాజరవుతున్నారు. ఇప్పటికే అందరూ వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లా చరిత్రలో మొట్టమొదటి అతి పెద్ద బిజినెస్ నెట్‌వర్కింగ్ కాన్‌క్లేవ్ జరగబోతుంది. గ్రూప్ చర్చల ద్వారా హాజరయ్యే ప్రతినిధులంతా వివిధ అంశాలపై చర్చించుకుంటారు. కొత్త కస్టమర్లను ఆకర్షించి, బిజినెస్ పెంచుకోవాలనే ఆలోచనతో వచ్చేవారికి ఇది సదవకాశం. బిజినెస్ విజిబిలిటీ దొరుకుతుంది. బిజినెస్‌ను ప్రమోట్ చేసుకోవచ్చు. బిజినెస్‌లో పరస్పరం సత్సంబంధాలు పెంపొందించుకోవడానికి వ్యాపారులకు అవకాశం కలుగుతుంది. వ్యాపార విస్తరణలో, వృద్ధి చెందడంలో ఎదురయ్యే సవాళ్లు, అందిపుచ్చుకొనే అవకాశాలపై చర్చ జరిగింది.

**ప్రశ్న: కాన్ క్లేవ్‌లో ఎటువంటి స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు?**

**జవాబు:** ప్రత్యేక ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాము. ఇందులో ప్రముఖంగా వీఎస్ఆర్ వెంకట సాయి ఇన్‌ఫ్రా, వీఎస్ఆర్ గాయత్రీ టౌన్‌షిప్, టీఆర్‌జే ట్రేడర్స్, విజయలక్ష్మీ ప్రొఫైల్స్, వీఎస్ఆర్ ఆన్ ఎంటర్‌ప్రైజెస్, వీఎస్ఆర్ శివశక్తి ఏజెన్సీస్, ఎస్‌వీఎన్ బే పార్క్, వెకా యూపీవీసీ, శివసాయి ఎంటర్ ప్రైజెస్ (ఏషియన్ పెయింట్స్), గజానన్ సిరామిక్, జేడీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ హోం సర్వీసెస్, స్కిన్ మెడ్, అభయ హాస్పిటల్, విబ్‌గొర్ పెబ్ స్టాల్స్ ఏర్పాటుచేసి వారి ప్రొడక్ట్స్ అందిస్తున్న సేవలను ప్రదర్శిస్తున్నాము.

# పవన్ తక్కువేం కాదు.. బాబు క్లారిటీ?



ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు మార్కు పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఎప్పట్లానే ఆయన ఈదఫా కూడా రేటింగ్స్, ర్యాంకుల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఫైల్స్ క్లియరెన్స్ విషయంలో డిసెంబర్ వరకు మంత్రుల పనితీరు ఎలా ఉందనే అంశంపై ఆయన ర్యాంకులు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ జాబితాలో చంద్రబాబుకు ఆరో ర్యాంక్ రాగా, లోకేష్‌కు 8వ ర్యాంకు వచ్చింది. ఇక ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏకంగా 10వ ర్యాంకుకు పడిపోయారు. దీనిపై మంత్రుల్లోనే కాదు, సోషల్ మీడియాలో కూడా తెగ చర్చ నడిచింది. స్వయంగా పవన్‌కల్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు ఈ జాబితాపై గుర్రుగా ఉన్నారు. ఈమధ్య లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్స్ బలంగా వినిపించిన నేపథ్యం లో, జాబితాలో అతడికి పవన్ కంటే మెరుగైన ర్యాంక్ రావడంపై జనసేన కార్యకర్తలు అసహనంతో ఉన్నట్టు తెలుస్తోంది. లెక్కప్రకారం, అది సరైన ర్యాంకింగ్ జాబితానే కావొచ్చు. ఎందుకంటే, పవన్ వద్ద చాలా మంత్రిత్వ శాఖలున్నాయి. కాబట్టి ఫైళ్ల క్లియరెన్స్ నెమ్మదిగానే సాగుతుంది. అయినప్పటికీ ఈ ర్యాంకులు మంత్రుల మధ్య, పార్టీల మధ్య అభిప్రాయబేధాలకు దారితీసిందనే సంకేతాలు బయటకొచ్చాయి. మరీ ముఖ్యంగా జనసేన–టీడీపీ మధ్య విభజన ఏర్పడే ప్రమాదం తలెత్తిందంటూ కథనాలు–విశ్లేషణలు పుట్టుకొచ్చాయి. దీంతో దాన్ని కవర్ చేసేందుకు స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగారు. ఎవ్వరూ ఎక్కువ కాదు, అలా అని ఎవ్వరూ తక్కువ కాదంటూ సుదీర్ఘంగా తనకుతాను వివరణ ఇచ్చుకున్నారు చంద్రబాబు. నేరుగా పవన్ కల్యాణ్ పేరును ఆయన ప్రస్తావించని ప్పటికీ, ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పని చేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే తప్ప, ఎవ్వర్నీ కించపరిచే ఉద్దేశం లేదంటూ సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. 'గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమష్టిగా పని చేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి.. సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం.' అంటూ బుజ్జగించే మాటలు మాట్లాడారు. చంద్రబాబు మాటలతో పైకి కనిపించని ఈ వివాదం చల్లారుతుందేమో చూడాలి. అన్నట్టు చంద్రబాబు ర్యాంకులు ప్రకటించే టైమ్‌లో అక్కడ పవన్‌కల్యాణ్ లేరు. ఆయన వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు.

- గ్రేటాంధ్ర సౌజన్యంతో..



పీయూసీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు టీడీపీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు బొనిగి భాస్కరరావు, వంజంగి మాజీ సర్పంచ్ యండ అప్పలనాయుడు అభినందనలు తెలిపారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

## ఆలయ శిఖర ప్రతిష్ట మహోత్సవంలో ఎంపీపీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

తమ్మినాయిడుపేట పంచాయతీ బెండువానిపేట గ్రామంలో అమ్మవారి ఆలయ శిఖరం ప్రతిష్ట కార్యక్రమంలో ఎచ్చెర్ల మండల పరిషత్ అధ్యక్షులు మొదలవలస చిరంజీవి పాల్గొన్నారు. అనంతరం వేదపండితుల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా నాయకులు ఎన్ని ధనుంజయరావు, మొదలవలస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి అవిశ్రాంతంగా శ్రమించే వ్యక్తి రవికుమార్

**- పీయూసీ చైర్మన్‌గా నియామకంపై హర్షం । కూనకు శుభాకాంక్షల వెల్లువ -**

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



అభివృద్ధి ప్రదాత కూన రవికుమార్ అని జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బీవీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ఇటీవల పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పీయూసీ) చైర్మన్‌గా కూటమి ప్రభుత్వంచే నియమింపబడిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. ఈ సందర్భంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ ఆమదాలవలస అభివృద్ధి కేవలం కూన రవికుమార్‌తోనే సాధ్యపడుతుందన్నారు. ఎమ్మెల్యేగా అహర్నిశలు, అవిశ్రాంతంగా శ్రమించిన వ్యక్తి రవికుమార్ అని ఉద్ఘాటించారు. ఎంతో ఓపిగ్గా ప్రజా వినతులు స్వీకరించి, తానే స్వయంగా పరిష్కారం చూపుతుండడం హర్షనీయమన్నారు. ఆమదాలవలస నియోజకవర్గం కేవలం ఆరు నెలల్లోనే గణనీయమైన అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గం నుంచి శ్రీకాకుళం జిల్లా కేంద్రం శ్రీకాకుళం వరకు సీఎస్పీ రహదారి నిర్మాణం వేగవంతం చేసి ఇంచుమించు పూర్తి చేశారన్నారు. అలాగే ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో తారు రోడ్లు, ప్రధాన రహదారులు, సీఎస్పీ రహదారి మరమ్మతులు పూర్తిచేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం తాగు, సాగునీటి వనరుల సంరక్షణ మరమ్మతులు గాలికి వదిలేసి, ఎక్కడా రహదారులపై పిడికెడు మట్టి వేసి కనీసం గోతులను పూడ్చిన దాఖలాలు లేకపోయిందని, కూటమి ప్రభుత్వం చొరవతో ప్రస్తుతం అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు నిలువెత్తు రూపం, నిబద్ధతకు నిదర్శనం, కళింగ జాతి ఆశాకిరణం ఎమ్మెల్యే కూన రవికుమార్ అని అన్నారు. రవికుమార్ రాష్ట్ర పీయూసీ చైర్మన్‌గా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు నందివాడ గోవిందరావు, శివ్వాల సూర్యం, బూర్జ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాంజీ, కంట్లం మాజీ సర్పంచ్ గిరడ హరిబాబు, కొర్లకోట ఎంపీటీసీ భాస్కరరావు, దొంకలపర్త టీడీపీ నాయకులు జడ్డు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో ప్రజలంతా పండగ చేసుకుంటున్నారు

**- టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో ప్రజలంతా పండగ చేసుకుంటున్నారని శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యం ప్రవేశపెట్టి చక్కని పోషకాహారం అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన వాట్సప్‌లోనే టెన్త్, ఇంటర్ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే గొప్ప అవకాశాన్ని కలిగించి విద్యావ్యవస్థపై నిరంతరం కొత్త ఆలోచనతో యువతకు, విద్యార్థులకు అండగా నిలుస్తున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్వర్ణయుగ పాలన అందిస్తుందని, అన్ని వర్గాల ప్రజల అవసరాలకు, ఆలోచనలకు, ఆశయాలకు అనుగుణంగా ప్రజారంజక పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. టెన్త్, ఇంటర్ ఎగ్జామ్స్ హాల్ టికెట్స్ చక్కగా ఎవరికి వారే సైట్స్, ప్రభుత్వ వాట్సాప్ సర్వీస్ మన మిత్ర 95523 00009 నెంబర్ ద్వార డౌన్‌లోడ్ చేసుకునే గొప్ప అవకాశం కలిగిస్తున్నారని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో ఎన్నికల హామీలు అయిన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఎన్నికల కోడ్ ముగిసాక మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి లోటులేకుండా అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్రానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అభివృద్ధితో పాటు శ్రీకాకుళం జిల్లా, నియోజవర్గం అభివృద్ధిపై నిరంతరం శ్రమిస్తూ అండగా నిలుస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా పరుగులు పెడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్‌లకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.






## ఈఎంటీలకు శిక్షణ తరగతులు



(సత్యంన్యూస్, టెక్కలి)

అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించే 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు టెక్కలి జిల్లా హాస్పిటల్ ఆవరణలో శుక్రవారం ఏఈఎంఎస్‌వోఈ రంగాప్రసాద్ పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణతరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్ల 108 ఈఎంటీలు పాల్గొన్నారు.

## ఎంఈవో మృతి తీరని లోటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం మండల విద్యాశాఖ అధికారి జి.కృష్ణారావు అకాల మరణం విద్యావ్యవస్థకి తీరని లోటని, ప్రభుత్వ పాఠశాలలను బాగా తీర్చిదిద్దే మంచి వ్యక్తి అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణారావు గురువారం మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే శంకర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన మృతి తీరని లోటని సంతాపం వ్యక్తం చేసి, ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. విద్యారంగంలో కృష్ణారావు సేవలు విద్యావ్యవస్థ మరువదని, మంచి వ్యక్తిని కోల్పోయామని అన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.